విశాలాంధ్ర

విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

విజ్ఞాన్స్ వర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కోటి ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు మాత్రమే భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయని తెలిపారు. 2023 సంవత్సరంలో విద్యార్థులు కష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని... వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషిచేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో 2023వ సంవత్సరానికి గాను తీర్మానించిన ప్రతిజ్ఞను చేయించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యంతో పాటు పరిశోధనాత్మక ఆలోచనలు కలిగిన విద్యా విధానం ఉండాలని తెలిపారు. కార్పొరేట్ ప్రపంచంలో యువతకు విస్తృత అవకాశాలున్నాయని, వాటిని సాధించేందుకు అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ వేడుకలలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, లారా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ గుంటూరు జిల్లా 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే సంవత్సరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచుటకు కృషి చేయాలని అదేవిధంగా తమ న్యాయమైన హక్కుల కోసం కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వ సహకారంతో ముందుకు నడవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ నాయకులు సుధారాణి, సామ్రాజ్యం, ఎండీ ఆరిఫ్, షబీనా పర్వీన్, రాజ్యలక్ష్మి, యల్లమందరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో అడుగులు వేయండి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రతిఒక్కరూ గడిచిన సంవత్సరంలో తాము సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలతో, ప్రణాళికలతో లక్ష్యాల వైపు అడుగులు వేయాలని విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య సూచించారు. గుంటూరు, పలకలూరు రోడ్‌లోని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక వెల్లడించారు. ఎదురైన ఓటములను, అడ్డంకుల్ని అధిగమించి ఆత్మస్థైర్యంతో సాగాలని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనురాధ, విజ్ఞాన్ జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్నోవా హైక్రాస్ ధరలను ప్రకటించిన టయోటా కిర్లోస్కర్ మోటార్

గుంటూరు: అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తోన్న తమ నూతన ఇన్నోవా హైక్రాస్ ధరలను టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకెఎం) వెల్లడించింది. టయోటా విడుదల చేసిన ఈ నూతన వాహనం 18,30,000 రూపాయల నుంచి 28,97,000 రూపాయలు (ఎక్స్‌షోరూమ్)లో లభిస్తుంది. టయోటా ఈ సరికొత్త కారును నవంబర్ 2022న విడుదల చేయడంతో పాటుగా బుకింగ్స్ కూడా ప్రారంభించింది. అన్ని గ్రేడ్‌లకూ భారతదేశ వ్యాప్తంగా ఒకే ధరలు వర్తిస్తాయని, ప్లాటినమ్ పెరల్ వైట్ కలర్‌కు అదనపు ప్రీమియం వర్తిస్తుందని టీకెఎం సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు.

పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్ర ప్రభుత్వ ఫించనుదారులు ఈ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదిలోగా లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించాలని పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూచిరాజు రామకృష్ణమూర్తి, బొమ్మదేవర వెంకటేశ్వరరావు తెలిపారు. అసోసియేషన్ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించే అవకాశం కల్పించినట్లు, ప్రతిరోజు ఉదయం 9 గంటలకు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 2 గంటల నుంచి 5 గంటల వరకు సర్టిఫికెట్ల స్వీకరణకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఫించనర్లు తమ ఆధార్‌కార్డు, పీపీఓ నెంబర్లు, సీఎఎఫ్ఎంఎస్ఐడీ, సెల్‌ఫోన్ తీసుకుని రావాలని కోరారు. ఈ అవకాశాన్ని ఫించనర్లు ఉపయోగించుకోవాలని కోరారు.

సినీనటుడు చలపతిరావుకు సంతాపం

విశాలాంధ్ర-తెనాలి : వెండితెర మీద ఐదు దశాబ్దాల పాటు క్యారెక్టర్ యాక్టర్‌గా, విలన్‌గా, కమేడియన్‌గా నటించిన చలపతిరావు మృతిపట్ల తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ, అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఇస్కఫ్ శాఖలు తమ ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

సంఘ కార్యక్రమాలు విస్తృతపరచాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని సత్య ఇన్వెస్టిగేషన్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ నాయకత్వంలో నాయకులు 2022 సంవత్సరానికి వీడ్కోలు...2023 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి డీవీఎస్ఎస్ మూర్తి, ట్రెజరర్ యూ.మాణిక్యాలరావు, కార్యవర్గ సభ్యులు బీవీ సుబ్బారెడ్డి, కెవీ నారాయణ, నారా కృష్ణ ప్రసాద్ పాల్గొని 2022 సంవత్సరంలో సంఘ కార్యక్రమాలను సమీక్షించారు. 2023 నూతన సంవత్సరంలో సంఘం కార్యక్రమాలను విస్తృతపరచాలని తీర్మానించి సంఘ సభ్యులకు, విశ్రాంత పోలీస్ అధికారులకు, సర్వీస్‌లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

కారు బైకు ఢీ.. ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-పొన్నూరు: మండలంలోని జిబిసి రోడ్డు మామిళ్ళపల్లి అడ్డరోడ్డు వద్ద శనివారం రాత్రి కారు బైక్ ఢీకొని బైకు మీద ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలైనాయి. ద్విచక్ర వాహనదారులు ఇద్దరు చుండూరు మండలం మోదుకూరుకు చెందిన వారని సమాచారం. క్షతగాత్రులను పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రజా పోరాటాల సంవత్సరంగా '2023'

మాట తప్పిన ప్రభుత్వాలపై పోరు

టిడ్కో, జగనన్న కాలనీల లబ్ధిదారులకు న్యాయం కోరుతూ ఉద్యమం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల పిలుపు

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీపీఐ జిల్లా కమిటీ

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజా పోరాటాల సంవత్సరంగా 2023ను నిర్ణయించినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. మాట తప్పి... మడమ తిప్పిన... ప్రభుత్వాలపై పోరాటానికి సీపీఐ పునరంకితం అవుతుం దన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవ న్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 95 శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్న టిడ్కో ఇళ్లను వైసీపీ అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాలు పైబడినప్పటికి లబ్ధిదారులకు ఇవ్వకపో వడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో వారికి న్యాయం చేయాలని కోరుతూ జనవరి నెలలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పూనుకోనున్నట్లు వెల్లడించారు. పట్టణాలలో సెంటు, గ్రామాలలో సెంటున్నర చొప్పున పేదలకు జగనన్న కాలనీలలో ప్రభుత్వం స్థలాలు ఇచ్చిందని, అయితే ఈ స్థలం నివాసయోగ్యం కాదని సీపీఐ చెప్పినప్పటికి ప్రభుత్వం సెంటు, సెంటున్నర స్థలమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా కాలనీలను సందర్శించామని, అక్కడ కనీసం ఐదు ఇళ్లు కూడా నిర్మాణాలు పూర్తి చేసుకోని దృశ్యాలు కనిపించాయని అన్నారు. పేరుకే స్థలాలు కేటాయించారని, ఇళ్ళు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇళ్ళు నిర్మించకపోగా లబ్ధిదారులే నిర్మాణాలు చేసుకోవాలని లేకుంటే స్థలం ఇతరులకు కేటాయిస్తామని బెదిరింపులకు పాల్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అప్పు దొరక్క... ఇళ్లు నిర్మించుకోలేక వారు నరకయాతన అనుభవిస్తున్నారని చెప్పారు. జగనన్న కాలనీ వాసులకు న్యాయం చేయాలని జనవరి, ఫిబ్రవరి మాసాలలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులు, రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు లక్ష మందితో జనవరి 27వ తేదిన ప్రజాగర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. దానికి సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవిన్యూ డివిజన్‌లలో దీక్షలు నిర్వహించబోతున్నారని, దానిలో భాగంగా 25వ తేదిన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షలు చేపట్టనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్నారని, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పోలీసు వ్యవస్థ ప్రతిపక్షాల నోరు నొక్కేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై గళమెత్తే హక్కు ఉందా... లేదా... అంటూ ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ దుర్మార్గానికి వ్యతిరేకంగా జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, భారీ పోరాటాలకు సిద్ధం కానున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని తిరుపతయ్య, ముప్పాళ్ల శివ శంకర్రావు, మేడా హనుమంతరావు, పచ్చల శివాజీ, షేక్ వలి, పుప్పాల సత్యనారాయణ, కాబోతు ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పట్టణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో మెయిన్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, లెవలింగ్ పనులు చేపట్టి మౌలిక సౌకర్యాలు కల్పించి ఇళ్ల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలక్టరేట్ లోని డీఆర్సీ సమావేశ మందిరంలో కలెక్టర్, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరిలతో కలసి స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, విద్యుత్ శాఖ అధికారులు, ఏజెన్సీలు, కాంట్రాక్టర్లతో గుంటూరు, తెనాలి, పొన్నూరు పట్టణ పరిధిలో ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అర్బన్ మండలాల వారీగా లే అవుట్లలో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాల పనులపై కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలను అధికారులు సమన్వయంతో పని చేసి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కాలనీలలో మెయిన్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, లెవలింగ్ పనులు పూర్తిపై దృష్టి పెట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిలో బేస్మెంట్ లెవెల్ నుండి బేస్మెంట్ లేవల్‌కు, బేస్మెంట్ లెవల్ నుంచి రూఫ్ లెవెల్‌కు స్టేజ్ కన్వెన్షన్‌కు తీసుకువెళ్లాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేలు రుణాలు అందిస్తామని, లబ్ధిదారులకు బ్యాంకు ల ద్వారా ఋణాల మంజురుకు మెప్మా అధికారులు లీడ్ బ్యాంకు మేనేజరుతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్లు తమ సమస్యలపై నేరుగా జేఎండీ, ఎండి వద్దకు వెళితే ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కాంట్రాక్టర్లు పను లను నాణ్యతగా చేపట్టాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాల న్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ కే.వి.సాయి నాథ కుమార్, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్.ఈ బ్రహ్మయ్య, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్.ఈ సురేష్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఎస్.ఈ శ్రీనివాసులు, మెప్మా పీడీ వెంకటనారాయణ, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, గుంటూరు ఆర్డిఓ ప్రభాకర రెడ్డి, పొన్నూరు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీఓ కాలమాని ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు : ఏపీ ఎన్జీఓ గుంటూరు జిల్లా నాయకుల ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా అసోసియేషన్ కాలమానిని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వంతో సహకరించి పనిచేయాలని కోరారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్లందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మరో ప్రకటనలో అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి సతీష్‌కుమార్‌లు మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో కొన్ని సవరణలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యాప్ ద్వారా వచ్చే టెక్నికల్ సమస్యలను సరిచేసి అప్‌డేట్ చేసి అమలు చేస్తే ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవన్నారు. ఉద్యోగులకు అటెండెన్స్ పడకపోవడం వలన జీతం తగ్గించే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. ఎల్.శ్రీధర్ రెడ్డి, డీడీ నాయక్, శ్యాంసుందర్, జి.హరిబాబు, కె.శివజ్యోతి, సూరి, సీహెచ్ కళ్యాణ్‌కుమార్, బ్రహ్మేశ్వరరావు, విజయ్ బాబు, సునీల్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, రాధా రాణి, లక్ష్మీ రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం

విశాలాంధ్ర-మంగళగిరి : ఎంతోమంది మహానుభావులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మంగళగిరి పట్టణ అధ్యక్షులు అన్నవరపు ప్రభాకర్ విమర్శించారు. మంగళగిరి శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ కార్యక్రమం కామ్రేడ్ అన్నవరపు ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ పట్టణ కార్యదర్శి గండికోట దుర్గారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా మారుస్తూ కార్మికులను కార్పొరేట్ శక్తులకు బానిసలుగా చేశారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశంలోని కార్మికులంతా మరో స్వతంత్ర పోరాటానికి పూనుకోవాల్సిన సమయం వచ్చిందని వారు అన్నారు. అనంతరం 2022కు వీడ్కోలు పలుకుతూ 2023కు స్వాగతం పలుకుతూ కార్మికులు కేక్ కట్ చేశారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, దుర్గారావులకు కార్మికులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాయుడు, తులసి శీను, సీతయ్య, నరసయ్య, కార్మికులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయ్ జయంతి

విశాలాంధ్ర-పొన్నూరు : మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ 96వ జయంతి వేడుకలను పొన్నూరులోని 19వ వార్డు ఎస్‌టి కాలనీలో జరిగింది. ముఖ్యఅతిథిగా పొన్నూరు పట్టణ బీజేపీ పట్టణ అధ్యక్షుడు దాసరి రమేష్ వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వాజ్‌పేయ్ అనేక నూతన ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన బాటలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పనిచేస్తున్నాడని, వాజ్‌పేయ్ చూపిన బాటలో నేటి ప్రజా ప్రతినిధులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పోతూరి సోమేశ్వరరావు, తలపాల సుబ్బారావు, కొమరగిరి శ్రీనివాసరావు, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోగి ప్రాణాలు కాపాడిన జీజీహెచ్ వైద్యులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)గ్యాస్ట్రో ఏంటరాలజీ విభాగం తొలిసారిగా అత్యాధునిక ఖరీదైన ఎండోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్స చేసి రోగి ప్రాణాలను కాపాడారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం పెదపాలెంకు చెందిన బి.అశోక్ కుమార్ రక్తపు వాంతులతో ఈ నెల 12న జీజీహెచ్ అత్యవసర విభాగానికి వచ్చారు. రోగి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండటంతో వైద్యులు మెడికల్ ఐసీయూలో చేర్పించారు. రోగికి పరీక్షలు చేయగా క్లోమ గ్రంథి ఉబ్బి పక్కన ఉన్న 'స్ప్లేనిక్ ఆర్టరీ పసేందో అనేరీజం' వల్ల రక్తపు వాంతులు అయ్యాయని వైద్యులు నిర్ధారించారు. ఈ కేసును గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి రిఫర్ చేశారు. ఆ విభాగం ఆచార్యులు డాక్టర్ జగన్‌మోహన్, సహా చార్యులు డాక్టర్ నాగూర్‌బాషా, డాక్టర్ శివ రామకృష్ణలు పరీక్షించి ఎండోస్కోపీ అల్ట్రాసౌండ్ ద్వారా కాయిల్, గ్లూ ఇంజక్షన్ ఇవ్వాలని నిర్ధారించారు. ఈ నెల 21న రోగికి వైద్యులు శస్త్ర చికిత్స చేసి విజయవంతం చేయడంతో రోగి ఊపిరి పీల్చుకున్నాడు. ఈ చికిత్సకు మత్తు వైద్యులు శైలజ సహకరించారు. రోగి ఆరోగ్యంగా ఉండటంతో శనివారం డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్స ప్రైవేట్ ఆసుపత్రిలో చేయాలంటే రూ.3లక్షలు నుంచి రూ.4లక్షలు ఖర్చు అవుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేసినట్లు ఆమె చెప్పారు. వైద్యులు చేసిన కృషిని ఆమె అభినందించారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-గుంటూరు : కార్మికుల సంక్షేమం కోసం వైసీపీ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్-టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక సంస్థలోని మేయర్ ఛాంబర్‌లో నూతన సంవత్సర వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మేయర్ మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్‌లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజిలలు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈదులమూడి మధుబాబు, జనరల్ బాడీ, కమిటీ సభ్యులు మేయర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కమిటీ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి ప్రేమ చందు, ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటిబాబు, కోశాధికారి నాగిపోగు సుమన్, సంయుక్త కార్యదర్శి రవిశంకర్, కమిటీ మెంబర్లు నరేష్, లక్ష్మీ నారాయణ, భారతి, ఎస్తేర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సాంకేతికంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న 8వ తరగతి విద్యార్థులకు శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో అందజేశారు. నియోజకవర్గంలోని రెండో డివిజన్ మణిపురంలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలక సంస్థ పాఠశాల, రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ నగరపాలక సంస్థ పాఠశాలలో కార్పొరేటర్లు మర్రి అంజలి, పోతురాజు సమత, తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమాలు పాల్గొని ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మర్రి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు జిలానీ, గొలుసు చంద్రం, షరీఫ్, జాఫర్ ఖాన్, సమద్, నూర్, శ్రీధర్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం

విశాలాంధ్ర-గుంటూరు : అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి.శాంతమూర్తి అధ్యక్షతన గుంటూరు మహాత్మాగాంధీ కళాశాలలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల అవసరాలు గమనించి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే సుపరిపాలన అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో వినూత్న పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, డాక్టర్ జాన్‌బాబు, సుందర్‌రామశర్మ, చక్రపాణి, తిరుపతిరెడ్డి, జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'అయ్యప్ప సేవా సమాఖ్య' నిరసన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హిందూ దేవుళ్లయిన శివ, కేశవులు, అయ్యప్పస్వామి వారిపై కించపరిచే వ్యాఖ్యలు చేస్తూ అయ్యప్పస్వామి వారిని వరంగల్, హనుమకొండ అంబేద్కర్ సభలో అత్యంత దారుణంగా అవమానించిన నాస్తికవాది భైరి నరేష్, రాజేష్ అనే వారిని చట్టప్రకారం వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని కోరుతూ ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు స్థానిక అరండల్‌పేటలో ఉన్న శివాలయం నుంచి లాడ్జిసెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన మార్చ్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అయ్యప్ప సేవా సమాఖ్య ఆంధ్రప్రదేశ్ వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో గుంటూరు నగరం, ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న అయ్యప్ప దీక్షా స్వాములు, అయ్యప్ప భక్తులు, ఆధ్యాత్మిక ప్రతినిధులు, సనాతన ధర్మ వాదులందరూ అధిక సంఖ్యలో ఈ నిరసన మార్చ్ ర్యాలిలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు సిటి, ఏటి అగ్రహారం 4/6వ లైను కాపురస్తులు **పంతంగి పురుషోత్తమరావు** గారి భార్య **పంతంగి మంజు (సెల్ : 7013746590)** అను నేను నా పేరిట గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం మరియు గ్రామ డి.నెం.170-ఎ నందలి య.0-40 సెంట్లు భూమి కలదు. సదరు భూమికి గాను నా పేరిట గల విక్రయ దస్తావేజు **నెం.1354/2015** మరియు లింకు దస్తావేజు **నెం.860/2009** రెండింటినీ ఒక బ్యాగులో పెట్టుకుని గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసు నుండి జిల్లా కోర్టు ప్రాంతానికి ఆటోలో వెళ్ళచుండగా మార్గమధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

సైక్లోన్ భీభత్సం ఆ దేశ నిర్లక్ష్యమే..

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పర్యావరణ పరిరక్షణ బాధ్యతను సంపన్న దేశాలు వర్ధమాన దేశాలుపైకి నెట్టేసి తమ బాధ్యత లేదని తప్పించుకోవాలని చూస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అమెరికాను కుదిపేస్తున్న బాంబ్ సైక్లోన్ కల్లోలమే ప్రత్యక్ష నిదర్శనమని పర్యావరణ ఉద్యమనేత అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం 'ప్రకృతి విపత్తులు-స్వయంకృతం' అనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఇందుశేఖర్ మాట్లాడుతూ భూతాపం పెరగటం, పర్యావరణ అసమతుల్యత, వాతావరణ మార్పులు వంటి కారణాల వల్లే ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. మానవ తప్పిదాలే ఈ పరిస్థితికి కారణమని దుయ్యబట్టారు. పర్యావరణ ప్రచారకులు టి.నారపరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, భూతాపం వంటి అంశాలుపై అంతర్జాతీయ సదస్సులు నిర్వహించి తీర్మానాలు ఆమోదించే సంపన్న దేశాలు పర్యావరణ పరిరక్షణపై వీసమెత్తు శ్రద్ధ చూపకపోవటం వల్లనే ఈ తుఫానులు వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రపంచం ఎలా పోయినా పర్వాలేదనే ధోరణితో వ్యవహరిస్తే ఇలాంటి ఘోర పరిస్థితులు పునరావృత్తమవుతూనే ఉంటాయని హెచ్చరించారు. ఈ చర్చలో కొండా శివరామిరెడ్డి, రవిబాబు, ఆర్.వెంకటరత్నం, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

'సుమేధ'లో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక ఎన్జీజీ వోస్ కాలనీలోని సుమేధ హైస్కూల్‌లో నూతన సంవత్సర వేడుకలు, ఆరెంజ్ కలర్ డేని ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులందరూ ఆరంజ్ కలర్ దుస్తులత ఆకట్టుకున్నారు. దీనిలో భాగంగా కమలా పండు విశిష్టత, దీనిలోని ఔషద గుణాలను తెలియజేయటం ముఖ్యఉద్దేశంగా, రోజు ఒక ఆరంజ్ పండును తీసుకోవటం ద్వారా సి విటమిన్ పుష్కలంగా లభించటం, కిడ్నీలోని రాళ్ళను కూడా నియంత్రిస్తుందని తెలియజేశారు. ముఖ్యంగా వివిధ రకాల పుష్పాలతో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర ఆహ్వాన ముగ్గులు విద్యార్థులను కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని అందరూ నూతన సంవత్సర సంబరాలు చేసుకున్నారు.

ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ముప్పాళ్ళ

విశాలాంధ్ర-తాడికొండ : సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్య దర్శి ముప్పాళ్ళ శివశంకరరావు నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలి పారు. 2023లో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని కోరారు.

సావిత్రిబాయి పూలే జయంతి జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి : భారతదేశ ప్రథమ సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిబా పూలే సతీమణి భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 191వ జయంతి కార్యక్రమాన్ని మంగళగిరి రత్నాల చెరువు రోడ్డులోని పొట్లబత్తుని వెంకటేశ్వరరావు కళావేదిక, లక్ష్మీ శారీస్ బిల్డింగ్‌పైన, పాత మంగళగిరి బైపాస్ రోడ్డు పక్కన జనవరి 3 వేదిన సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్‌టీఈపీ మంగళగిరి నాయకులు ఆర్.ఆదినారాయణ, రేఖా కృష్ణార్జున రావు, కంచర్ల కాశయ్య, ఆకురాతి శంకరరావు కోరారు. నేటి మహిళల్లో ఉన్న ఆత్మన్యూనతా భావాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసాన్ని నింపి, తద్వారా సామాన్య మహిళలను శక్తివంతమైన మహిళలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త బీఎం లీలాకుమారి, ప్రగతి నారిశక్తి వ్యవస్థాపకురాలు పొట్లూరి దేవి, ఎస్‌టీఈపీ రాష్ట్ర నాయకురాలు కె.పావని, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావులు పాల్గొంటారని తెలిపారు.

నగర ప్రజలకు అప్పిరెడ్డి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి గుంటూరు జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఇంటిలో ఆరోగ్యం, ఆనందాన్ని రెట్టింపు చేయాలని, గడప గడపలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని అప్పిరెడ్డి ఆకాంక్షించారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మరింత మెరుగైన ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు ఈ కొత్త సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింతగా కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు సిటి, రాజేంద్రనగర్ రెండో లైను, సింధూరి ఎన్ క్లేవ్, ఫ్లాట్ నెంబర్ 104 కాపురస్తులు **తాడి బోయిన శ్రీరామమూర్తి** (లేటు) గారి కుమారుడు **తాడి బోయిన శ్రీకాంత్** వాస్తవ్యుడైన నేను ఆధార్ నెంబర్ 69139228 3825 తెలియజేయునది ఏమనగా **ది : 22 -12- 2022** తేదీన డాక్యుమెంట్ 1 **నెం : 2122 /1984** సర్వేనెంబర్ **47/2 , 47/3** మరియు డాక్యుమెంట్ 2 నెం **767/2000** సర్వేనెంబర్ **47/1** నందు గల యు. 0.26 1/2 సెంట్లు గల ఆస్తి ఒరిజినల్ డాక్యుమెంట్ ఇంటి నుండి తీసుకొని నరసరావుపేట లోని మల్లమ్మ సెంటర్ నందు లైఫ్ లైన్ హాస్పిటల్ దగ్గర ప్రయాణించు సమయంలో చేతిలోని డాక్యుమెంట్ ఉన్న కవర్ పోయినది. దస్తావేజులు పోయినట్లు గమనించి మరలా వెనుకకు వెళ్లి విచారించి వెతికిన దొరకలేదు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికినచో పైన తెలిపిన నివాసముంటున్న అడ్రస్ కి కానీ, దిగువన ఉన్న నా ఫోన్ నెంబర్ కి తెలియజేయగలరు. Ph : **89778 64777**

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన గుంటూరుసిటీ, చైతన్యపురి 3వ లైను, సాయిబాబారోడ్డు కాపురస్తులు గద్దె శంకరరావుగారి కుమార్తె గద్దం గీతా భవాని(సెల్:9121537440) గారి సూచనల మేరకు యావన్మందికీ తెలియ జేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి ప్రకాశం జిల్లా, చీరాల(మం), పేరాల గ్రామ గ్రామ కాపురస్తుడు రామిశెట్టి వెంకయ్య గారి కుమారుడు రామిశెట్టి వెంకట సాంబశివరావు గారు విక్రయ దస్తావేజు నెం.6258/2013 యస్.ఆర్.ఓ గుంటూరు ద్వారా కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించు చున్న ఆస్తిని విక్రయించుటకు బహిరంగపరచగా నాక్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడివున్నారు.కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు, కోర్టుజప్తులు వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7రోజుల లోగా నాకుగాని, నాక్లయింటునకు గాని వ్రాతపూర్వకమైన ఆధారాలతో తెలియజేయగలరు. గడువు లోగా షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి ఆక్షేపణలు వగైరాలు రానియెడల నిష్పేచి ఆస్తిగా భావించి నాక్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజును పొందగలరని తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు నాక్లయింటు హక్కులను, షెడ్యూలు ఆస్తిని భద్దపరచ జాలవు.

షెడ్యూలు: గుంటూరు డి॥, గుంటూరు సిటీ, చైతన్యపురి డివిజన్ నెం.38 మరియు డివిజన్ నెం.39 వెరశి 6-58 సెంట్లలో 120 చ.గ.ల విస్తీర్ణం కలిగిన భూమికి హద్దులు. **తూర్పు:**30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** గద్దం వరలక్ష్మి గారి ఆస్తి, **పడమర:** నేను పూర్వం విక్రయించిన ఆస్తి, **ఉత్తరం:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు.

మేడగం శ్రీనివాస రెడ్డి, అడ్వకేట్
డోర్.నెం.20-18-8/1, యం.జి. నగర్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు.

ప్రకటన

నా క్లయింట్ అయిన ఆంధ్రప్రదేశ్ N.T.R జిల్లా, విజయవాడ, D.NO 59A-21-5/3 వివేకనంద కాలనీ, R.R గార్డెన్ వాస్తవ్యులు MD పర్వేజ్ S/O ఇర్ఫాన్ గారి సంజాయిషీ పొంది యాపన్మందికి తెలియ పరుచనది ఏమనగా నా క్లయింట్, తెలంగాణారాష్ట్రం, హైదారాబాద్ వాస్తవ్యుడైన యల్లా ప్రగడ చంద్రమౌళి S/O నరసింహరావు నుండి గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఈ దిగువ షెడ్యూలు దాఖాలా ఆస్థిని క్రయం పోందుటకు నిర్ణయించుకొని ఈ షెడ్యూలు ఆస్థిని సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించు చున్న యల్లా ప్రగడ చంద్రమౌళి గారి వద్ద నుండి అగ్రిమెంట్ చేసుకొనుటకు సిద్ధంగా ఉన్నారు. కనుక సదరు షెడ్యూలు ఆస్థికి ఎవరైనా వారసులు గాని, కోర్టు ఎటాచ్‌మెంట్స్ గాని, క్లయిమ్స్‌గాని, తనాఖా, తాకట్టులుగాని అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులు లోగా నాకు అందజేయగలరు. ఆ తరువాత వచ్చే క్లయిమ్స్ మాక్లయింట్‌ను బైండు చేయజాలవు.

షెడ్యూలు

గుంటూరుజిల్లా మంగళగిరి సబ్‌రిజిష్టార్ యిలాకా, మంగళగిరిలోచేరిన R.S NO. 123-2.అయిన షెడ్యూలాస్థికి హద్దులు :- తూర్పు: ఇతరుల ఆస్థి, పడమర: జాతీయ రహదారి (చెన్నై హైవే), దక్షిణం: ఇతరుల ఆస్థి, ఉత్తరం: ఇతరుల ఆస్థి ఈ నాలుగు సరిహద్దుల మధ్య చ.గ.919.6 లేక చ.మీ.769ల స్థిరాస్థి మొత్తం19 సెంట్లు

ఇట్లు: **బత్తుల సాయిబాబు**
అడ్వకేట్
పడవలరేవు సెంటర్, గుణదల, విజయవాడ-520004.
Cell No: 9848414168

మద్యం రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : మద్యం అక్రమ రవాణా చేస్తున్న ఇరువురు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘ టన శనివారం జరిగింది. వినుకొండ మండల పరిధిలోని ఏనుగుపా లెం గ్రామ సమీపంలో ఇరువురు యువకులు ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాలీ ఆటోల ద్వారా గోవా రాష్ట్రానికి చెందిన రాయల్ స్టాగ్ 84 ఫుల్ బాటిల్స్‌ను తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, సరుకు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలతో పాటు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ దుర్గాప్రసాద్, సీఐ విజయభాస్కర్, ఎస్ఐ నాగలక్ష్మి వెల్లడించారు.

366 కొత్త పెన్షన్లు మంజూరు

విశాలాంధ్ర-దుర్గి : మండలంలో 366 కొత్త పెన్షన్లు మంజూరైనట్లు ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, ఎంపీడీవో గుప్తా శనివారం తెలిపారు. అడిగొప్పల-69, దుర్గి-47, ముటుకూరు-56, ఓబులేశు నిపల్లె-70, ధర్మవరం-29, కోలగుట్ల-19, ఆత్మకూరు-27, పోలేపల్లి-49 గ్రామ సచివాలయాల వారీగా కొత్త పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు.

ట్యాబ్‌లు సక్రమ మార్గంలో వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-దుర్గి : విద్యా ర్థుల బంగారు భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి జగన్ విద్యారంగంలో ఎన్నో సంస్క రణలకు శ్రీకారం చుట్టారని ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ముటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ట్యాబ్‌లను సక్రమ మార్గంలో ఉపయోగించుకుని ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోటకూర నాగేశ్వరరావు, ఎంపీటీసీ పసుపులేటి వెంకట్రామయ్య, ఉప సర్పంచ్ గొంది నాసరయ్య, ఎంఈఓ అల్లి సురేష్, ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ షకీల దస్తగిరి పాల్గొని, విద్యార్థులకు ట్యాబ్ లను పంపిణీ చేసి, ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేడం టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-శావల్యాపురం : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టేబోయే పాదయాత్రకు ప్రజలందరూ సంఘీభావం తెలపాలని మండల టీడీపీ అధ్యక్షులు గుంటూరు సాంబ శివరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సెంటర్‌లో ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలకి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సాంబశివరావు మాట్లాడుతూ లోకేష్ 400 రోజుల పాటు 4 వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించ బోతున్నట్లు తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, అనేక రకాల మోసపూరిత హామీలు ఇచ్చి యువకులను, ప్రజలను మోసం చేసిన విధానాన్ని లోకేష్ ప్రజలకు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గడిపూడి విశ్వనాదం, బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, గోరింట్ల హనుమంతరావు, చింతా గంగయ్య, చెరుకూరి చౌదరి, నలమాటి వెంకటేష్ పాల్గొన్నారు.

పింఛన్ తొలగింపుపై దద్దరిల్లిన మున్సిపల్ సమావేశం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నూతన సంవత్సర కానుకగా అవ్వతాతల పింఛన్లు తొలగించారని, ఆరు నెలల ఒక సారి సమీక్షలు అంటూ పింఛన్ దారులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని టీడీపీ సభ్యులు ధ్వజమెత్తారు. విమర్శలు, ప్రతి విమర్శలు, వాదనలతో మున్సిపల్ సమావేశం కొన సాగింది. శనివారం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత 2022-23 బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎజెండా చదవటం ముగిసిన తర్వాత బడ్జెట్‌లోని అంశాలపై చర్చించవచ్చని తెలిపారు. అయితే టీడీపీ తొలగించిన పింఛన్, సౌకర్యాలు లేని టిడ్కో గృహాలపై చర్చించాలని కోరారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవింద రావు అభ్యంతరం వ్యక్తం చేయగా, చైర్మన్ రఫాని ఇందుకు అనుమతించారు. అర్హతలు ఉన్నా ఫించన్లు తొలగించారని, వాటిపై ఆధారపడి బతికే పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని టీడీపీ సభ్యులు ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో కేవలం 11 పెన్షన్లకు అనర్హత... అర్హత ఉన్న ఓ ఒక్క వ్యక్తి పింఛన్ తొలగించలేదని మున్సిపల్ చైర్మన్ రఫాని తెలిపారు. ప్రభుత్వంపై బురద జల్లాలని టీడీపీ సభ్యులు ప్రయత్నిస్తున్నారని, పూర్తి సమాచారం తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు పింఛన్ల పై పూర్తి నివేదిక అందజేస్తూ చిలకలూరిపేట మున్సిపాలిటి పరిధిలో 1173 మందికి నోటీసులు జారీ చేశారని, వివిధ ఆధారాలు సమర్పించిన 1162 మంది పింఛన్లు పునరుద్ధరించారని వెల్లడించారు. కొత్తగా జనవరి నెల నుంచి 328 పింఛన్లు అందజేస్తున్నట్లు వివరించారు. దాత మైలవరపు గుండయ్య గతంలో లక్ష్మీనరసింహ

టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల ఘర్షణ

స్వామి దేవస్థానానికి పట్టణంలోని కేబీ రోడ్డులో భూమిని దానం ఇచ్చారని, ఆ స్థలంలో వివిధ చేతివృత్తివాళ్లు, మోటార్ మెకానిక్‌లు అద్దెలు చెల్లించుకుంటూ తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని టీడీపీ కౌన్సిలర్ శివపార్వతి వివరించారు. అయితే ఇటీవల కొంత మంది కొంత నగదు ముట్టచెప్పి, వారిని ఖాళీ చేయాలని ఆదేశిస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ చైర్మన్ రఫాని సమాధానం ఇస్తూ తనకు బాధితుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. టిడ్కో గృహాల లబ్దిదారులకు సరైన వసతులు కల్పించకుండానే గృహ ప్రవేశాలంటూ అట్టహాసంగా కార్యక్రమం నిర్వహించారని టీడీపీ సభ్యులు శివపార్వతి, గంగా శ్రీనివాసరావు తదితరులు ఆరోపించారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు కల్పించుకోవటంతో వాగ్వాదం కొనసాగింది. టీడీపీ సభ్యుడు గంగా శ్రీనివాసరావు గణపవరంలో పింఛన్లు తొలగించారని వాదనకు దిగారు. ఈక్రమంలో చైర్మన్ రఫాని సభ ముగిసిందని ప్రకటించారు.

స్నేహశీలి బూసి సుబ్బారావు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : దివంగత సీనియర్ న్యాయవాది, సెంట్రల్ నోటరీ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర నేత, ఏఐఎస్ఎఫ్ నాయకులు బూసి సుబ్బారావు 5వ వర్థంతి సభ శనివారం సత్తెనపల్లి బార్ అసోసియేషన్ హల్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి అధ్యక్షతన జరిగింది. తొలుత బూసి సుబ్బారావు చిత్రపటానికి సహచర న్యాయవాదులు, మిత్రులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది పక్కాల సూరిబాబు మాట్లాడుతూ బూసి సుబ్బారావు స్నేహశీలి అని, నమ్మిన సిద్ధాంతం కోసం, ఉత్తమ కమ్యూనిస్టుగా, న్యాయవాదిగా కడవరకు పేదలకు సహాయం చేసి ప్రజలమన్నలు పొందిన ఆదర్శమూర్తి అని కొనియాడుతూ తనతో ఉన్న అనుభంధాన్ని మననం చేసుకోని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నరిశేటి వేణుగోపాల్, అంకాళ్ళ వెంకటేశ్వర్లు, కళ్ళెం వీరభాస్కర రెడ్డి, బీఎల్ చిన్నయ్య, గంగూరి అజయ్ కుమార్, మాదంశెట్టి వేదాద్రి, రాజవరపు నరశింహరావు, అబ్దుల్ రహీం, జేపీ విజయ్ కుమార్, ఏజీపీబాల్ షైదా, వీరయ్య, మన్నెం వెంకటేశ్వరరావులతోపాటు బూసి సుబ్బారావు ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఏ సుభాని, ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కంభాల శ్రీనివాస్, కరిముల్లా, మంగలపూరి నాగేశ్వరరావు, దాసు, సీహెచ్ సురేష్, రత్తయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-శావల్యాపురం : స్థానిక మండల మానవ వనరుల కార్యాలయంలో శనివారం ఎంఈఓ మద్దికుంట సాంబశివ రావు ఎస్టీయూ ప్రచురించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్య రంగ పరిరక్షణకు ఎస్టీయూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో ఎస్టీయూ మండల అధ్యక్షులు బిళ్ళా రాజా రమేష్, జిల్లా కౌన్సిలర్ నిర్మలా కుమారీ, ఎంఆర్సీ సిబ్బంది త్రివిక్రమ్, జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ఆడాలి

విశాలాంధ్ర-ఈపూరు : క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ఆడాలని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి కళాశాలకు చెందిన కాటూరి దుర్గాప్రసాద్ అనే విద్యార్థి బీపీఈడి ప్రథమ సంవత్సరం చదువుతూ ఈ నెల 29,30వ తేదీల్లో గుంటూరు సమీపంలోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొని నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికై 2023 జనవరి 12వ తేదీ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు విశ్వ విద్యాలయంలో జరిగే ఆల్ ఇండియా విశ్వవిద్యాలయ పోటీలకు నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు తమ కళాశాల విద్యార్థి దుర్గాప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడూ గెలుపే లక్ష్యంగా ఆడాలని, పట్టుదల, క్రమశిక్షణతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని, ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. గతంలో పిల్లలు క్రీడా మైదానాలకు వెళ్లి క్రికెట్, కోతికొమ్మచ్చి, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ ఖో ఖో వంటి ఎన్నో ఆటలు ఆడేవారని, కానీ నేడు మొబైల్ ఫోన్‌లు వచ్చి వారి జీవితాలతో ఆడుకుంటున్నాయని, యువత చరవాణిలకు బానిసలు అయ్యారని, క్రీడలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత క్రీడలు ఆడడం ద్వారా శారీరకంగా, మానసికంగా స్థిరత్వం కలిగి ఉంటారన్నారు. అనంతరం దుర్గా ప్రసాద్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు అధ్యాపకులు ఎం.సురేష్, వై.సురేష్ కుమార్, ఆర్.బలరాం నాయక్, దాసు, సిబ్బంది తదితరులు అభినందించారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

విశాలాంధ్ర-వినుకొండ: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ తమ మిత్రపక్షం జనసేనతో కలిసి పని చేస్తుందని పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షులు కర్ల అమర సైదారావు తెలిపారు. పల్నాడు జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక కారంపూడి రోడ్డు లోని బృందావనం కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షులు యార్లగడ్డ లెనిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షులు కర్ల అమర సైదా రావు, జిల్లా ఇన్చార్జ్ దాసం ఉమ మహేశరవుతో కలిసి హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

సాంకేతికత పెంపునకే ట్యాబ్‌లు

విశాలాంధ్ర-రెంటచింతల: విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేస్తోందని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలోని 35 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్ లను ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో 574 ట్యాబ్ లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నారని అందులో భాగంగానే నాణ్యమైన విద్య కోసం బైజూస్ పాఠాలతో కూడిన ట్యాబ్ లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ట్యాబ్ లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోహన్ రావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'గీతమ్స్'లో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక గీతమ్స్ హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కరస్పాండెంట్ మాలపాటికోటిరెడ్డి హాజరయ్యారు. ముందుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల సభలో విద్యార్థులు కేకును కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం రంగవల్లికను వేసి అలరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి మాట్లాడుతూ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ 2023 సంవత్సరం అందరి జీవితాలలో ఆనందాన్ని నింపాలని, శ్రద్ధగా చదువుకొని ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.కృష్ణవేణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతాంజలిలో న్యూ ఇయర్ వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక గీతాంజలి స్కూల్ స్కూల్, గీతాంజలి రేసిడెన్షియల్ స్కూల్‌లో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ తెళ్ళ కృష్ణవేణి చిన్నారులకు శుభాకాంక్షలు అందించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులు మంచి నడవడికతో ఈ నూతన సంవత్సరంలో మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని రాణించి తల్లిదండ్రుల పేరు నిలపాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండంట్ శ్రీ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పెదకూరపాడు : రాష్ట్రోపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీలను పెదకూరపాడు మండల విద్యా శాఖాధికారి ఏకుల ప్రసాద రావు స్థానిక ఎంపీపీ స్కూల్, జేబీ శనివారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. మన దగ్గర చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, సమయ పాలన పాటించాలని కోరారు. 2023లో జరగబోతున్న బదిలీలలో తమరు కోరుకోవాలను కున్న స్థానాలు పొందాలని ఆకాంక్షించారు. సంఘాలు తమ హక్కులకై నిరంతరం పోరాటాలు చేస్తాయని తెలిపారు. ఎస్టీయూ ప్రెసిడెంట్ షేక్ న్యామతుల్లా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం ఎస్టీయూ పోరాడుతుందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవిబాబు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులకు సంబంధించిన అంశాల సాధనలో ఎస్టీయూ ముందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ పీవీడీ ప్రసాద్, మహిళా కన్వీనర్లు నిర్మల, బేబిరాణి, కాత్యాయిని, జోస్పినమ్మ, మార్తమ్మ, వరలక్ష్మి, భారతీ దేవి, రజిముంతా బేగం, దుర్గాప్రసాద్, సురేష్, అబ్దుల్ మజీద్, జాన్ సైదా, అల్లం జోసెఫ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడులు అంచనా

విశాలాంధ్ర-శావల్యాపురం : పంటకోత ప్రయోగాలతో దిగుబడులు అంచనా వేయవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిరా మురళి అన్నారు. మండలంలోని శానంపూడి గ్రామంలో శనివారం అన్నవరపు చిన అంకమ్మరావు పొలంలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ ఇంగిరాల మురళి మాట్లాడుతూ రైతు పొలంలో 25 గజాల విస్తీర్ణంలో పంట కోసి విత్తనాలు కాటా వేయగా 14.35 కేజీలు వచ్చాయని, వీటి ఆదారంగా 31 బస్తాల దిగుబడి వస్తున్నట్లు అంచని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు, ఏఓ రామారావు, ఏఈఓ ఆశోక, వీఏఓ ఇర్మియా తదితరులు పాల్గొన్నారు.

నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో విప్పర్ల గ్రామంలో గల ఎస్టీ కాలనీలో శనివారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జలజీవన్ మిషన్ టిడబ్ల్యు ఎస్ ఎం. నవీన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ ద్వారా దూరప్రాంతాలకు వెళ్ళి నీరు తెచ్చుకునే కష్టాలు ఉండవని అన్నారు. ప్రతి రోజూ ప్రతి వ్యక్తికి 55 లీటర్ల సురక్షితమైన నీటిని అందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యమని అన్నారు. అదే విధంగా నీరు, పారిశుద్ధ్యం పై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జలజీవన్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ బాబూరావు, విఏఓలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పవన్‌పై వ్యక్తిగత విమర్శలు సహించం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: విమర్శలు పార్టీ సిద్ధాంతంపై ఉండాలని, జనసేన అధినేత పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఏపీ కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మడి సత్యానారాయణ ఖండించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు, నాయకులు ప్రధాన ప్రతిపక్ష పార్టీ టీడీపీని వదలి, ఒక లక్ష్యంగా పవన్‌ను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి దానిని వదిలేసి పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకోవటంలోనే మీ దివాళ కోరుతనం బయటపడుతుందని మండి పడ్డారు. రాజకీయ విమర్శలు చేయటాన్ని ఎవరైనా సరే స్వాగతిస్తారని. వ్యక్తిగత విమర్శలు,వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూసే ప్రయత్నాలు నాగరిక లక్షణం కాదన్నారు. మంత్రి అంబటి రాంబాబు మరోక్క సారి పవన్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తే సత్తెనపల్లిలో తమ నిరసనను చూడవలసి వస్తుందని హెచ్చరించారు.

నిజాంపట్నం ఎస్ఐగా రమేష్

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎస్.రమేష్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎం.రోశయ్య బదిలీ అవ్వడంతో అడవులదీవి పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్.రమేష్ సాధారణ బదిలీల్లో భాగంగా నిజాంపట్నం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచుతామని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల - హరినాథ్ బాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అధికారులకు సూచించారు. శనివారం స్థానిక నిజాంపట్నం లోని బీసీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు ఏమన్నా పాఠశాల పరిధిలోని తీర్చుకోవాలని రోడ్ల మీదకి ఎక్కి ధర్నా చేయడం సరికాదని వారు తెలిపారు. ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడం వల్ల సమస్యలు పట్టించుకోవడంలేదని విద్యార్థులు వాపోయారు. తమకు హాస్టల్లో భోజనం సరిగా ఉండడం లేదని, మంచినీళ్లు, స్నానం చేయడానికి కూడా నీళ్ల సదుపాయం సరిగా లేదని, బాత్రూమ్స్‌లో లైట్లు వెలగడం లేదని, ఫ్యాను లేవని విద్యార్థుల సమస్యలను తెలియజేశారు. ఈ సమస్యను విని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల విద్యార్థులకు 8 ఫ్యాన్లు,6 కుర్చీలు, మౌలిక సదుపాయాలు విద్యార్థులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక విద్యాశాఖ జోనల్ అధికారి అక్క రాజు, తహశీల్దార్ ఎం.శిరీష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు బుద్ధి చెప్పాలి

విశాలాంధ్ర-వినుకొండ: నిత్య వసరసరుకుల ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతాం అని సి ఐ టి యూ రాష్ట్ర నాయకులు ఓబులు అన్నారు. కార్మిక చైతన్యయాత్ర శనివారం వినుకొండ చేరుకుంది. డిసెంబర్ 28నుండి జనవరి 1వరకు,హిదూపురం నుండి భీమవరం వరకు సిఐటియూ రాష్ట్ర16వ మహాసభలసందర్భంగా కార్మిక చైతన్య యాత్ర జాత ద్వారా ప్రజలను, కార్మికులను చైతన్య పరుస్తామని ఓబులు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు స్వరూపరాణి, పల్నాడు జిల్లా నాయకులు హనుమంత రెడ్డి, ఆంజనేయనాయక్, వినుకొండ సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బి. వెంకటేశ్వర్లు, ఆంజనేయులు,తిరుమల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పథకాలు చేరువ చేస్తున్న వలంటీర్ వ్యవస్థ: మంత్రి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరువ చేయడంలో వలంటీర్ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం గ్రామ వలంటీర్లు, కోఆర్డినేటర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభు త్వాన్ని మరలా అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయం గా వలంటీర్లు, కోఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అప్పులో ఉన్నప్పటికి చంద్రబాబు నాయుడు చేసిన అప్పుల్ని కూడా తీర్చుతూ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. గ్రామ స్థాయిలో ప్రశాంత్ కిషోర్ బృందాలు పర్యటిస్తూ ప్రజాప్రతినిధుల పనితీరును సేకరిస్తారన్నారు. అవ్వ, తాతలకు ప్రతి నెలా 1వ తేదీన ఫించన్లు అందించి వారి ముఖాల్లో చిరునవ్వులు నింపుతున్న వలంటీర్ వ్యవస్థను చాలా మంది అపహాస్యం చేస్తున్నారని నాగార్జున అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమంటూ దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించే స్థాయికి ఎదుగుతారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ దేవినేని మల్లికార్జున రావు, ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, ఎంపిపి డి. లలితకుమారి, జడ్పిటిసి తిరువీదుల ఉదయభాస్కరి, గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపిటిసిలు, మండల, గ్రామ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ..

మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంత్రి నాగార్జున శనివారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ట్యాబ్‌లను సద్వినియోగపరచుకుని విద్యలో రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పి.లాజర్, ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపిసిపిఎస్ స్టేట్ కోశాధికారి గుర్రం మురళీమోహన్ శనివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు వినతిపత్రం అందించారు. మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జునకు వినతిపత్రం అందించామని వైసిపి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని, జిపిఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మురళీమోహన్ చెప్పారు.

నకిలీ విక్రయ బయాన అభియోగంలో పలువురు అరెస్ట్

విశాలాంధ్ర-వినుకొండ : పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అశోక్ కుమార్ మాట్లాడుతూ వినుకొండ మండలం జలాలపాలెం గ్రామానికి చెందిన సురభి వెంకటేశ్వర్లు, బత్తుల లక్ష్మినారాయణ, ఒర్సు శ్రీనులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ అశోక్ బాబు తెలిపారు. వినుకొండ పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను చూసి వాటిని అడంగల్ చెక్ చేసి ఎవరి పేరు మీద అయితే భూములు ఉన్నాయో వారి పేరు మీద పట్టాదారు పాస్ బుక్స్, ఆధార్ కార్డ్స్ నకిలీవి తయారు చేయించి పట్టాదారు పాస్ పుస్తకాలపై ప్రభుత్వ అధికారుల నకిలీ స్టాంప్స్ వేసి ఆ భూములకు హక్కుదారులు మేమె అంటూ నకిలీ విక్రయ బయాన తయారు చేసిన అభియోగంలో వినుకొండ పట్టణానికి చెందిన నేరెళ్ల పాపారావు అనే వ్యక్తి తనకు చెందిన వినుకొండ మండలం వెంకుపాలెం గ్రామ పరిధిలో ఆరు ఎకరాల 75 సెంట్లు విస్తీర్ణం గల భూమిని భయానా అగ్రిమెంట్ ద్వారా తనకు రాసి ఇచ్చినట్లు నకిలీ డాక్యుమెంటు తయారు చేసి దేరంగుల శ్రీనివాసరావు, కుందనపు సూర్యనారాయణ అనే వ్యక్తులకు అగ్రిమెంట్ చేశాడు. నేరెళ్ల పాపారావు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి సురబీ వెంకటేశ్వర్లుతో పాటు వినుకొండకు చెందిన బత్తుల లక్ష్మీనారాయణ, గుంటూరుకు చెందిన ఒర్సు శ్రీనులను అరెస్ట్ చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. వినుకొండ ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నూతన సంవత్సర సందడి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం చెపేందుకు ప్రజలు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. గృహాలను విద్యుత్ కాంతులతో అలంకరించి ఇంటి ముందు రంగవల్లికలతో నూతర సంవత్సరానికి స్వాగతం పలికేందుకు పోటీలు పడి రంగులతో ముగులను మహిళలు తీర్చిదిద్దారు. రకరకాల స్వీట్లు తో నిర్వాహకులు దుకాణాలను ఏర్పాటు చేయగా మిఠాయిలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సాహంగా దుకాణాల వద్దకు చేరుకోవడంతో శనివారం సాయంత్రం నుంచి పండుగ వాతావరణం నెలకొంది. రంగులను తీసుకు వెళ్లేందుకు రోడ్లపైకి ప్రజలు రావడంతో రోడ్లన్ని సందటిగా మారాయి. యువత వేడుకలు నిర్వహించుకునేందుకు కేక్‌లను కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. డిజె శబ్దాలు ఏర్పాటు చేయవద్దని, వాహనాల రాక పోకలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులకు సహకరించి ప్రశాంతంగా ప్రమాద రహితంగా వేడుకలు జరుపుకోవాలని భట్టిప్రోలు ఎస్ఐ వై. సురేష్ కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసు బృందాలు పర్యటిస్తున్నాయని ఎవరైనా అల్లర్లకు పాల్పడినా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సురేష్ హెచ్చరించారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఓ.యస్.నెం : 2/2022

బిట్వీన్ :

కొల్లి తిరుపతిరావు - వాది

మరియు

తాల్లూరి సునీల్ మరియు గొడుగుల వంశీ కృష్ణ వర్మ - ప్రతివాదులు

D2: గొడుగుల వంశీ కృష్ణవర్మ, తండ్రి మురళీవర్మ, హిందువు, వయసు 46 సం॥రాలు, వ్యాపారం, ఆర్/ఓ. ప్లాటునెం. 413, మై హోమ్ అపార్ట్‌మెంటు, నవోదయ కాలనీ, గుంటూరు టౌన్.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాదికి పైకోర్టు ద్వారా పంపించిన దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారం ది.25-01-2023వ తేదిన ఉదయం 10.30గం॥లకు శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ హాజరై అక్షేవణలు ఏవైనా వున్నచో తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడును.

కావూరి జాలారావు
కావూరి రామకృష్ణ
వాది తరపు న్యాయవాదులు
గురజాల టౌన్, పల్నాడు జిల్లా.

జిల్లా ప్రజలకు ప్రముఖుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా ప్రజలకు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లు నూతన సంవత్సర శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలిపారు. 2023 నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ సుఖశాంతులు కలుగజేయాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, విద్యాపారంగా అభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ద్వారా సహాయం పొందుతున్న వర్గాలు వాటిని వినియోగించుకుని ఆర్థిక అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధికి అందరూ కృషి చేయాలని జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి నూతన సంవత్సరం మరో మైలురాయి కావాలని అన్నారు.

శనగలో సశ్య రక్షణ చర్యలు పాటించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: శనగ పంటలో సరైన సశ్యరక్షణ చర్యలు చేపట్టాలని, అక్కడక్కడ వేరుకుళ్ళు, శనగ పచ్చ పురుగు ఉధృతి చాలా తక్కువగా ఉన్నందున ఎలాంటి మందులు వాడవలసిన అవసరం లేదని పొలంబడి ల్లా శిక్షణ కోఆర్డినేటర్ ఎం శివకుమారి తెలిపారు. శనివారం చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి మస్తానమ్మ ఈ పంట నమోద ఆవశ్యకత గురించి వివరిస్తూ పంటల రాయితీలు రావాలంటే ఈ పంట నమోదు తప్పనిసరిని తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా
Bank of Baroda

లక్ష్మీపురం బ్రాంచి :
డి.నెం. 5-87-6, లక్ష్మీపురం మెయిన్ రోడ్, గుంటూరు - 522007. ఎపి. ఇండియా
Email : lakshm@bankofbaroda.co.in

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్ - III యొక్క సెక్షన్ 13(2) ప్రకారం)

ఋణగ్రహీత : మెస్సర్స్ వీరాణి కాటన్ ట్రేడర్స్, రిజిస్టర్ ఆఫీస్ : అసెస్‌మెంట్ నెం. 28609, కేరాఫ్: శ్రీ శ్రీనివాస కాటన్ జిన్నింగ్ మిల్స్, 2వ లైన్, టీబీనగర్, కమ్మశేషయ్య గ్రౌండ్స్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు- 522003. ప్రొ॥ శ్రీ చీవుల ప్రసాద్, డోర్ నెం. 4-5-79, 5వ లైన్, త్యాగరాజ రోడ్డు, కొరిటిపాడు, గుంటూరు. హామీదారు : శ్రీ యం. కిషోర్ చౌదరి, తండ్రి : కొండయ్య, డోర్ నెం. 6-16-47/48, అరండల్‌పేట, 16/3, సాయిబాబా గుడి దగ్గర, గుంటూరు - 522002

విషయము: బ్యాంక్ ఆఫ్ బరోడా, లక్ష్మీపురం బ్రాంచి, గుంటూరు వారు మీకు మంజూరు చేసిన ఆర్థిక సహాయం- క్యాష్ క్రెడిట్, ఫండెడ్ ఇంటరెస్ట్ టర్మ్ లోన్ (ఎఫ్ఐటిఎల్), టర్మ్‌లోన్, మరియు ఎఫ్ఐటిఎల్ లోన్ కి చెందిన అసలు మరియు వడ్డీ, మొదలగునవి చెల్లించడంలో మీరు విఫలం అయినారు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్-III యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిస్టర్ పోస్ట్ ద్వారా తేది. 20-12-2022 న మీకు తిరుగురసీదుతో కూడిన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. కానీ సదరు నోటీసు మీరు తీసుకోనందున మరియు తపాల శాఖ వారిచే బ్రాంచినకు తిరుగు రసీదులు వచ్చినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది : మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించ నందున సదరు అకౌంట్ తేది. 19-12-2022 నుండి నిరర్థక ఆస్తిగా (ఎన్‌పిఎ) పరిగణింపబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు విడిగా లేదా ఉమ్మడిగా బకాయి మొత్తం రూ. 1,21,28,307/- (అక్షరాల ఒక కోటి ఇరవై ఒక్క లక్ష ఇరవై ఎనిమిది వేల మూడు వందల ఏడు రూపాయలు మాత్రమే) + అమలుకాని వడ్డీ మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ, ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (13) నియమాను సారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ముందస్తు లిఖిత అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకం, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేయుబడినది.

ఆస్తి వివరములు:

తనఖా ఉంచుబడిన ఆస్తివివరాలు క్లుప్తంగా : గుంటూరు, గుంటూరు సిటీ, గుంటూరు పాత వార్డు నెం. 3, కొత్తమున్సిపల్ వార్డు నెం. 4, బ్లాక్ నెం. 3, టి.ఎస్.నెం. 183, అరండల్‌పేట, డోర్ నెం. 6-17-7 వద్ద 200 చ॥గ॥ల విస్తీర్ణంలో గల ఆర్‌సిసి డాబా. **హద్దులు : తూర్పు :** వల్లూరి సీతయ్య గారి ఆస్తి - 48 అ॥, **దక్షిణం :** మేడపల్లి నాగేంద్రమణి గారి ఆస్తి - 37.60 అ॥, **పడమర :** మన్నంగి వెంకటపతి గారి ఆస్తి - 48 అ॥, **ఉత్తరం :** 37.60 అ॥ వెడల్పు గల అరండల్‌పేట 17వ లైన్ - 37.60 అ॥

ప్రదేశం : గుంటూరు
తేది : 20-12-2022

సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా